**మిట్ట మధ్యాహ్నం! ఎండ నిప్పులు చెరుగుతోంది. వడగాలి తీవ్రత ఎక్కువగా ఉంది.**

**బస్సు జనంతో కిటకిటలాడుతూ, వడగాలిని ఛేదించుకుంటూ వేగంతో ముందుకు దూసుకుపోతోంది.**

# కళ్ళజోడు. మంగు పరమేశ్వరావు

బస్సులో ప్రయాణిస్తున్న నా మనసంతా బరువుగా ఉంది. గుండె వేదనా భరితమవుతోంది. ఉదయం నుంచి వచ్చి మంచి నీళ్లు కూడా ముట్టలేదు. ఎన్నో బస్సులు మారుతూ, ఎన్నో ప్రదేశాలు గాలిస్తూ, ఎన్నో స్టేజీల్లో ఎక్కి దిగుతూనే ఉన్నాను.

ప్రతీ మనిషిలో నాకు అమ్మ రూపమే లీలగా మెదులుతోంది. ప్రతీ మాట నా చెవులకి అమ్మ పిలుపులా ఆప్యాయత వొలికిస్తున్నట్లే ఉంది. నా మనసంతా ఆమె ఆలోచనలే ముసురుకుకుంటున్నారు.

నాకు ఊహ వచ్చే నాటికి నాన్న ట్రైన్ యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ఆ పరిస్థితిలో అమ్మకు అండగా నిలిచి, ధైర్యం చెప్పి ఆదరించే బంధువర్గమే కరువైంది. ఒకళ్లు, ఇద్దరూ ఉన్నా మమ్మల్ని తప్పుకుని తిరిగేవాళ్లు.

కుటుంబాన్ని పోషించడం కోసం రాత్రీ పగలు కష్టపడేది. తన రెక్కల కష్టంతోనే మమ్మల్ని పెంచి పెద్ద చేసింది.

ఇద్దరు అన్నయ్యలు జులాయిలుగా బజార్లన్నీ తిరిగొచ్చి డబ్బులు కావాలని అమ్మను వేధించేవాళ్లు.

వాళ్లు అమ్మను అనేక ఇబ్బందులు పెట్టే వాళ్లు. వాళ్లు ఎంత విసిగించినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా వాటన్నింటిని మరుక్షణంలోనే మర్చిపోయి ప్రేమను పంచేదిఒ అన్నయ్యలకు ఏదైనా చిన్న ఆపద కలిగినా తల్లడిల్లిపోయేది.


పెద్దన్నయ్య చెట్టు పైకి ఎక్కి క్రిందపడి కాలు విరగ్గొట్టుకున్నప్పుడు విలవిల్లాడిపోయింది. అన్నయ్య కాలు బాగై తిరిగి నడిచే వరకు ఎందరో దేవుళ్లను ప్రార్థించింది. అన్నయ్య ఆరోగ్యం కోసం విలపించిన అమ్మ రూపం జ్ఞప్తికి వస్తుంటే ఆమెపై ప్రేమ ద్విగుణీకృతమవుతోంది.

ఇద్దరన్నయ్యలను బడికి పంపిస్తే వాళ్లకి చదువు అబ్బలేదు. ఇంట్లో డబ్బులు దొంగలించి సినిమాలు చూడటానికి అలవాటుపడ్డారు. వీళ్ల ప్రవర్తనను చూసి అమ్మ ఎంతో బాధపడేది. చివరికి పెద్దన్నయ్యను హోటల్లో పనికి, చిన్న అన్నయ్యను ఫాన్సీ షాపులో పనికి కుదిర్చింది.

ఒకసారి నాకు జ్వరం వచ్చింది. అప్పుడు తాను కూడా నాతో పాటు నిద్రాహారాలు మాని తిరిగి నేను కోలుకునే వరకు ఎంతో ఆదుర్దాపడింది. అపుడు అమ్మలో నాకు కనిపించిన బాధ, ప్రేమ, ఆతృత, భయం, ఆప్యాయత, ఆపేక్షలు ఇప్పటికీ నా కళ్ల ఎదుట మెదులుతూనే ఉంటాయి.

నేను టెన్త్ పాసైనపుడు కొత్త బట్టలు కుట్టించి, సైకిలు, వాచీ కొనిచ్చి నన్ను కాలేజీలో చేర్పించింది. "అమ్మా! నేను కూడా ఏదైనా పనిలో చేరి, నీకు ఆసరాగా ఉంటాను...." అని ఎంత బ్రతిమలాడినా ఒప్పుకొనేది కాదు.

"నీకేం దిగులొద్దు. వాళ్లకి చదువు అబ్బలేదు. అందుకే వాళ్లను అలా చేసింది. నీకేం నా బంగారు బాబువి. నీవు బాగా చదువుతావని, నిన్ను ఇంకా



చదివించమని మీ హెడ్ మాస్టర్ నాతో చెప్పారు. డబ్బు గురించి నువ్వేం దిగులు పడొద్దు. బాగా చదువు కో...." అని నాకు ధైర్యం చెప్పింది.

కొంత కాలానికి తాను సంపాదించిన డబ్బుతో పెద్దన్నయ్యతో 'క్యాంటీన్', చిన్న అన్నయ్యతో 'ఫ్యాన్సీ షాపు' పెట్టించింది.

ఇద్దరికీ పెళ్లిళ్లు చేసింది.

క్రమంగా అమ్మ శరీరంలో ఓపిక తగ్గిపోయి, ఏ పనీ చేయలేని స్థితికి చేరింది. ఆరోగ్యం క్షీణించి జబ్బున పడింది.

అప్పటికి నేను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాను. నేను, అమ్మ పెద్దన్నయ్య వాళ్ల సంరక్షణలోనే ఉండే వాళ్లం.

నేను ఖాళీగా ఉండటం అన్నయ్య, వదినలకు సుతరామూ ఇష్టం లేదు. నన్నూ ఏదో ఒక పని చూసుకోమని తరచు చెప్పే వాళ్లు. నా మనసు చాలా బాధపడేది. కానీ వాళ్లు చెప్పేదీ నిజమే అనిపించేది.

చిన్న అన్నయ్య మా గురించి అసలు పట్టించుకొనేవాడు కాదు. 'అమ్మ దగ్గర చాలా డబ్బు ఉంద'ని ఇవ్వమని ఎన్నో సార్లు అడిగేవాడు. తన వద్ద ఏమీ లేదని చెప్పినా వినేవాడు కాదు. ఆ కోపంతోనే వేరే వెళ్లిపోయాడు.

అందుకే నేను కూడా ఏదో ఒక మార్గం చూసుకోవాలని ఒక రోజు అమ్మతో "అమ్మా! నేను కూడా ఏదైనా వ్యాపారం చేస్తాను" అన్నాను.

"వద్దురా విశ్వం! నిన్నింత కష్టపడి చదివించింది. 'నా కొడుకు ఉద్యోగస్తుడు' అని గర్వంగా చెప్పుకోవాలని. నాకు ఆ ఆశ తప్ప.... ఇంకేదీ లేదు." అని చెప్పింది.

ఆమె మాట కాదనలేకపోయాను. అందుకే అన్నయ్యలకు భారంగా ఉండకూడదనే అభిప్రాయంతో ప్రైవేట్ కంపెనీలో చేరాను. వచ్చే జీతం 'రూమ్ రెంట్'కు, ఇతర ఖర్చులకు బొటా బొటీగా సరిపోతుంది. ఉద్యోగం పొరుగూరులో కనుక ఖర్చులన్నీ తప్పని సరైనవే. అయినా ఎంతో కొంత అమ్మకి పంపిస్తుంటాను.

అమ్మను గురించిన ఆలోచనలు ప్రవాహంలా నాలో సాగుతూనే ఉన్నాయ్.

అమ్మకు దూరంగా ఉన్నా ఎప్పటి కప్పుడు లెటర్స్ ద్వారా ఆమె క్షేమ సమాచారాలు తెలుసుకుంటూనే ఉన్నాను.

ఒకసారి వచ్చిన ఉత్తరాన్ని బట్టి అమ్మ పరిస్థితి చాలా దయనీయంగా ఉందని తెలిసి వెళ్లాను.

అమ్మకు రెండు చేతులపై నీటి బొబ్బలు వచ్చి చితికి పుళ్ళు పడ్డాయి. భోజనం చేయటానికి వీలులేదు. అన్నయ్య, వదినలు చీదరించుకొని, ఇంటి వెనక ఉన్న గొడ్ల పాకలో అమ్మను వేరేగా ఉంచారు.

పెద్దవాళ్లుగాని, పిల్లలు గాని ఆమె దగ్గరకు వెళ్లలేదు.

అమ్మ స్థితిని చూసి నా హృదయం తల్లడిల్లిపోయింది. దుఃఖం పొర్లుకొచ్చింది.

కొద్ది రోజులు సెలవు పెట్టి అమ్మదగ్గరే ఉన్నాను. అమ్మ ఆరోగ్యం బాగైంది.

తనను ఆ ఇంట్లో ఎలా చూస్తోందీ అమ్మ నాకు చెప్పి ఏడ్చింది.

నేనున్న స్థితిలో అమ్మకు ఎలాంటి సహాయం అందించలేకపోయినందుకు నాపై నాకే అసహ్యం వేసింది.

ఇలా అమ్మను గురించిన గత స్మృతులలో తేలిపోతున్న నాకు బస్సు ఆగడంతో నేను చేయాల్సిన పని గుర్తుకు వచ్చింది.

బస్సు దిగి నడుస్తున్న నా ఆలోచనలన్నీ అమ్మ గురించే. నా కళ్లన్నీ ఆమె కోసం ఆశగా వెతుకుతున్నాయ్.



డాక్టరు గారూ! నాకు రాత్రిపూట నిద్ర రాకుండా ఇంజక్షన్ ఏదైనా ఇవ్వండి. అన్నాడు గూర్ఖా.

డాక్టర్: ఈ మాత్రం దానికి ఇంజక్షన్ దేనికి? ఊరి నిండా అప్పులు చెయ్యి రాత్రి నిద్రరాదు.

ఎస్.కె.యాకూబ్ అలీ
వేంసూరు

ప్రతీ బజారు చూశాను. ఆమె జాడ లేదు. ప్రతీ ఇంటి వద్ద వాకబు చేశాను. ఎవరూ చూడలేదన్నారు.

అమ్మ ఎక్కడుందో.....? ఆమె మనసుకి ఎంత బాధ కలిగితే ఇలా చేసిందో?

దీనికంతటికీ నాలుగు రోజుల క్రితం నాకు వచ్చిన ఉత్తరమే కారణం.

"ఒరే! విశ్వం!

మీ పెద్దన్నయ్య వ్రాయునది. అమ్మకు మేమేం తక్కువ చేశామని ఇలా చేసింది. మమ్మల్ని నలుగురిలో నవ్వులు పాలు చేయాలనే కదా! కాకపోతే "ఖాళీగా ఉండకపోతే గిన్నెలు, పళ్లాలు కడగరాదా!" అని మీ వదిన అంది. దాంతో 'తన చేత అర్థమైన పనులన్నీ చేయిస్తున్నారనీ, తనంటే ఇంట్లో పిల్లలకు కూడా గౌరవం లేదని, తనను ప్రేమతో పలకరించే వాళ్లే లేరని ఏడుస్తూ కూర్చుంది. రెండు రోజులు మెతుకన్నా ముట్టలేదు.


"నువ్వు అలిగి ఎవర్ని సాధించాలని" అని అడిగాను. "ఎన్నాళ్లు అలాగే ఉండగలవో ఉండు...." అని కాస్త కోపంగా అనాను.

ఒక రోజు ఉదయం చూస్తే అమ్మ లేదు. ఇల్లు విడిచి ఎటో వెళ్లింది! ఈ వయసులో ఇలాగేనా ఆమె ప్రవర్తించాల్సింది? పోయి వెతుకుదామన్నా 'క్యాంటీన్' దగ్గర ఎవరూ లేరు. చిన్నోణ్ణి అడిగితే 'షాపులో ఎవరూ లేరు... పోతేపోనీ...." అన్నాడు.

నీకు వీలైతే నాల్రోజులు సెలవు పెట్టి రావాలి. లోకం మనపై నిందమోపగలదు!

ఇట్లు
మీ పెద్దన్నయ్య
శంకరం

ఉత్తరం చదివిన నాకు గుండెను ఎవరో కెలికినట్లయింది. అమ్మను తలుచుకొని నాలో ప్రతి అణువూ శోకించింది.



### పవిత్ర పుష్పం

కమలం వేదాలలోను, సంస్కృత వాఙ్మయంలోను వర్ణించబడిన పవిత్ర పుష్పం. కాళిదాసు శాకుంతలములోను, ఇతర నాటకాల్లోనూ పేర్కొన్నాడు. సువాసనతో నిండిన కమలాలు తెలుపు, పాటలము, గులాబి లేక ఎరుపు రంగులో ఉంటాయి. ఇది కూడా మన దేశానికి చెందిన పుష్పమే.

— నమ్మోట

డబ్బే సర్వస్వంగా భావించే అన్నయ్యలను గురించి నాకు చిన్నప్పట్నుంచీ బాగా తెలుసు. వాళ్లు అమ్మను ఎలా చూస్తోందీ తెలుసు. కానీ ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు.

వారం రోజుల సెలవుతో వచ్చిన దగ్గర్నుంచీ వెతుకుతూనే ఉన్నాను. మాకు తెలిసిన బంధువుల ఇళ్లన్నీ తిరిగొచ్చాను. ఎన్నో చోట్ల వెతికాను. అమ్మజాడే లేదు.

అమ్మ జాడలేదనే దిగులు అన్నయ్యలకు లేదు. వదినలకూ లేదు. వాళ్లకు వాళ్ల వ్యాపారాలే ముఖ్యం. డబ్బుంటే చాలు అన్నీ సమకూర్చుకోవచ్చు అనేదే వాళ్ల సిద్ధాంతం.

సెలవులన్నీ అయిపోయాయి. చివరి రోజు బాగా పొద్దు పోయేవరకు తిరిగి నిరాశతో ఇంటికి చేరాను. అందరూ నిద్రలో జోగుతున్నారు. ఎవరూ ఎదురు చూడటం లేదు. ఎవరూ 'అమ్మ ఆచూకీ' అడగలేదు. ఎవర్నీ నేను లేపలేదు. ఎవరికీ చెప్పలేదు.

పెరట్లో అమ్మపడుకొనే ఇంట్లోకి వెళ్లాను. స్టూలుపై అమ్మ అన్నం తినే పళ్లెం. గ్లాసు ఉన్నాయి. ప్రేమగా ముద్దాడాను. అప్రయత్నంగా నా కళ్ళ నుండి కన్నీళ్లు జలజలా రాలాయి.

ఓ మూలగా అమ్మ తన వస్తువులన్నీ దాచుకునే ట్రంకు పెట్టె ఉంది. తెరచి చూశాను.

నాకు బాగా గుర్తు - చిన్నప్పుడు నేను బడికి వెళ్లేటప్పుడు పెట్టెలోని డబ్బాలోంచి చిల్లర తీసి ఇచ్చేది. ఆ డబ్బా మూత తీసి చూశాను.

అమ్మ రెండు కమ్మలూ అందులోనే ఉన్నాయ్. ట్రంకు పెట్టెలో మూలగా అమ్మ కళ్ల జోడు, పగిలిపోయిన అద్దం, దువ్వెన ఉన్నాయ్.

కళ్ల జోడును చేతుల్లోకి తీసుకున్నాను. చిన్నప్పట్నుంచీ నన్ను ప్రేమతో, ఆప్యాయతతో పెంచి పెద్ద చేసిన అమ్మ రెండు కళ్లూ ఆ కళ్లద్దాలలో నుంచి నా హృదయాన్ని తాకుతున్నట్లు ఉన్నాయ్.

అమ్మ కప్పుకునే దుప్పటి, దిండూ నన్ను ఆమె అమృత హస్తాల్లా స్పృశిస్తున్నాయ్. అమ్మ పడుకునే మంచంమీద పడుకుంటే అమ్మ పడిలో పడుకున్నంత హాయిగా ఉంది.

అలా అమ్మను తలుచుకుంటూ ఎప్పుడు నిద్ర పట్టిందో నాకే తెలియదు.

ఉదయాన్నే పిల్ల లొచ్చి లేపారు. అమ్మలేని అక్కడ ఒక్క క్షణం కూడా ఉండబుద్ధి కాలేదు.

వస్తువులన్నీ అన్నయ్య వాళ్లకిచ్చాను 'ఒక్క కళ్లజోడు మాత్రం నేను తీసుకుంటా' నన్నాను. అదివిని వదిన నవ్వు కోపడం గమనించాను. నా గుండెను కత్తితో కోసినట్లైంది. అన్నయ్యతో చెప్పి ఊరు వెళ్లి చిరుద్యోగంలో చేరాను.

నేను వెళ్లేటప్పుడు దారి పొడపునా నా కళ్లు అమ్మను వెతుకుతూనే ఉన్నాయ్. అయినా ఆమె జాడలేదు.

ఆమె కళ్ల జోడు నాతో ఉంటే అమ్మే నా దగ్గర ఉందనిపిస్తుంది. అమ్మను కాపాడుకోలేని నా చేతకాన్నితనాన్ని గుర్తు చేస్తుంటుంది.

మధ్య తరగతి మనిషిని నేను. రోజూ నిద్ర లేవగానే ఆ కళ్లజోడులో అమ్మ రూపాన్ని చూస్తుంటాను. అందుకే ఆ కళ్ల జోడు - నా ప్రాణం. ●